సాక్షి
నాగర్‌కర్నూల్
ఆదివారం । 31 । మార్చి । 2024

ఇఫ్తార్ 6-35
(ఆదివారం సాయంత్రం)
సహర్ 4-48
(సోమవారం తెల్లవారుజామున)
రంజాన్ వేళలు



హైవేపై అండర్ బ్రిడ్జిలు

జాతీయ రహదారి-44పై అండర్ బ్రిడ్జిల నిర్మాణానికి త్వరలోనే మోక్షం లభించనుంది.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
42.7 /21.2

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటూ అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'టెట్‌తో సంబంధం లేకుండా పదోన్నతులు ఇవ్వాలి'

ఉప్పునుంతల: విద్యాహక్కు చట్టం 2009 అమలుకంటే ముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్‌తో సంబంధం లేకుండా పదోన్నతులు కల్పించాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి జక్క రామస్వామి డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని తిప్పాపూర్ పాఠశాలలో నిర్వహించిన డీటీఎఫ్ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పదేళ్లుగా ప్రభుత్వాలు శ్రద్ధ తీసుకోకపోవడంతో విద్యారంగం పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం, విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల కమిషన్ అనుమతితో ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏలను వెంటనే విడుదల చేయాలని కోరారు. అదేవిధంగా విద్యాశాఖ అధికారులు టెట్‌కు సంబంధించిన సందేహాలను నివృత్తి చేయాలన్నారు. సమావేశంలో డీటీఎఫ్ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి జానకిరామ్, రత్నప్రసాద్, వెంకటయ్య, విజయ్, హజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అలివేలు మంగతాయారు హుండీ లెక్కింపు



మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అనుబంధమైన అలివేలు మంగతాయారు ఆలయంలో శనివారం హుండీ లెక్కింపు జరిగింది. రూ.5,62,300 హుండీ ద్వారా ఆదాయం వచ్చిందని ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు తెలిపారు. ఇందులో నోట్లు రూ.5,00,460 ఉండగా.. నాణెలు 61,840 వచ్చాయని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో అళహరి రామకృష్ణ, దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వీణధారి, మోహన్‌రెడ్డి, సుధా, బాలరాజు, మల్లు రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ టెంకాయల వేలం రూ.31.80 లక్షలు

నవాబుపేట: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మైసమ్మ ఆలయంలో టెంకాయల విక్రయానికి సంబంధించి శనివారం టెండర్లు ఖరారు చేసినట్లు దేవాలయ అధికారి మదనేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో జరిగిన వేలంలో కాకర్లపహాడ్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ రూ.31.80 లక్షలకు టెంకాయల విక్రయం, వాహన పూజ సామగ్రి విక్రయానికి సంబంధించి రూ.15.16 లక్షలకు టెండర్లు దక్కించుకున్నారు. అలాగే శ్రీనివాస్ పూల విక్రయానికి గాను రూ.5.65 లక్షలకు పూల విక్రయం టెండర్లు దక్కించుకున్నారు. కాగా.. గతేడాది టెండర్ల ద్వారా మొత్తం రూ.41 లక్షల ఆదాయం రాగా.. ఈసారి మరో రూ.10 లక్షలు పెరిగి మొత్తం రూ.51 లక్షలకు చేరింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కృష్ణయ్య, మాధవులు, నారాయణరెడ్డి, రాజు, నరేందర్, గోపాల్, సత్యం, బాలయ్య, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు



మల్దకల్: స్థానిక స్వయంభూ లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు మధుసూదనాచారి, రమేషాచారి, రవిచారిలు స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అదే విధంగా కొంత మంది భక్తులు స్వామి వారికి దాసంగాలు పెట్టి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆదిశిలా క్షేత్రంలో ర్యాలంపాడుకి చెందిన చిన్న నర్సింహులుగౌడు దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, మండల నాయకులు విక్రంసింహ రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రావు, బాబురావు, ఆలయ సిబ్బంది కృష్ణ, ఉరుకుందు, శ్రీను, రంగస్వామి, శివమ్మ తదితరులు ఉన్నారు.

'నిఘా' కట్టుదిట్టం

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో 6 చెక్‌పోస్టుల ఏర్పాటు



వెల్దండ రోడ్డుపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు(ఫైల్)

- తనిఖీల్లో నగదు, మద్యం స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు
- ఇప్పటికే కేంద్ర బలగాలతో ఫ్లాగ్‌మార్చ్
- తనిఖీ చేపడుతున్న సమయంలో వీడియో చిత్రీకరణ

నాగర్‌కర్నూల్ క్రైం: కొద్దిరోజుల కిందటే అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మళ్లీ పార్లమెంట్ ఎన్నికల సందడి మొదలైంది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 16న ఎన్నికల కోడ్ రావడంతో ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా ప్రభుత్వ శాఖలు తమ విధులను నిర్వహించాల్సి ఉంటుంది. ఈ మేరకు పార్లమెంట్ ఎన్నికల్లో ఆయా రాజకీయ పార్టీ అభ్యర్థులు ఓటర్లను డబ్బు, మద్యం ద్వారా ప్రభావితం చేయకుండా ఉండేందుకు నిఘాను కట్టుదిట్టం చేశారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిధిలో 6 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. నిరంతరం తనిఖీలు చేస్తూ..

ఇప్పటి వరకు **11** క్యాష్ సీజ్ కేసులు | రూ.**9** లక్షలకుపైగా నగదు స్వాధీనం

అక్రమ మద్యం, నగదును తరలించకుండా కట్టడి చేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఏవైనా ఇబ్బందులు తలెత్తితే పార్లమెంట్ ఎన్నికల్లో సమస్యలు ఉత్పన్నం కాకుండా కలెక్టర్ ఉదయ్‌కుమార్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ముందు నుంచే అన్ని చర్యలు చేపడుతూ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు.

ఓటర్లకు భరోసా కల్పించేందుకు ఫ్లాగ్‌మార్చ్..

జిల్లాలోని ప్రజలు, ఓటర్లు తమ ఓటుహక్కును ప్రశాంతంగా వినియోగించుకునేందుకు, వారికి భరోసా కల్పించేందుకు ఇప్పటికే కేంద్ర బలగాలతో జిల్లా కేంద్రంతో పాటు పలు నియోజకవర్గాల్లో కేంద్ర బలగాలతో ఫ్లాగ్‌మార్చ్‌ను నిర్వహించారు. కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులను సమన్వయం చేసి పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

తనిఖీల్లో నగదు స్వాధీనం

జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీల్లో ఇప్పటి వరకు 11 క్యాష్ సీజ్ కేసులు నమోదు చేసి రూ.9 లక్షలకు పైగా నగదును స్వాధీనం చేసుకున్నారు. 48 లిక్కర్ కేసులు నమోదు చేసి 1,078 లీటర్ల ఐఎంఎల్ మద్యం, 4 లీటర్ల బీర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. 67 బైండోవర్ కేసులు నమోదు చేసి, 94 మందిని బైండోవర్ చేశారు. అదేవిధంగా 23 లైసెన్స్ కల్గిన ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు.



జిల్లా కేంద్రంలో కేంద్ర బలగాలతో ఫ్లాగ్‌మార్చ్(ఫైల్)

ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం..



పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. జిల్లాలో 6 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి నిరంతరం వాహనాలను తనిఖీ చేస్తున్నాం. అక్రమంగా నగదు, మద్యాన్ని తీసుకెళ్తున్న వారి నుంచి వాటిని స్వాధీనం చేసుకుంటున్నాం. చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీలకు ప్రతిఒక్కరూ సహకరించాలి. ఓటర్లు తమ ఓటుహక్కును నిర్భయంగా వేసుకునేందుకు కేంద్ర బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తూ.. భరోసా కల్పిస్తున్నాం.

– గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, ఎస్పీ, నాగర్‌కర్నూల్

జిల్లాలో 6 చెక్‌పోస్టుల ఏర్పాటు

పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ఆరు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి కేంద్ర బలగాలతో పాటు జిల్లా పోలీసు సిబ్బందితో నిఘాను కట్టుదిట్టం చేశారు. ఈ నెల 19 నుంచి చెక్‌పోస్టులను ప్రారంభించి వాహనాల తనిఖీని చేపడుతున్నారు. జిల్లాలోని అమ్రాబాద్ మండలం మన్ననూరు వద్ద అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతం చెక్‌పోస్టు, జిల్లా సరిహద్దులోని వెల్దండ, చారకొండ, ఊర్కొండ మండలం ముచ్చర్లపల్లి, పెంట్లవెల్లి మండల కేంద్రంలో, బిజనేపల్లి మండలంలోని మంగనూరు వద్ద, ఉప్పునుంతల మండలంలోని లత్తిపూర్ వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి వాహన తనిఖీలు చేపడుతున్నారు. ఆ సమయంలో వీడియో చిత్రీకరణ నిర్వహిస్తున్నారు.

పోస్టల్ బ్యాలెట్‌ను పకడ్బందీగా నిర్వహించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ పి.ఉదయ్ కుమార్

కలెక్టర్ పి.ఉదయ్ కుమార్

నాగర్‌కర్నూల్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్లు, ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.ఉదయ్ కుమార్ మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో విధులు నిర్వహిస్తున్న వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ఫారం-12ని వినియోగించుకోవాలన్నారు. ఇందుకు గాను సీఈఓ కార్యాలయపు వెబ్‌సైట్‌లోని పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించిన వివరాలను ఎస్ఐసీ ద్వారా పొందుపరిచి పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ క్రమంలో ప్రతి జిల్లా అధికారి తమ కార్యాలయ సిబ్బందితో సహా తమ వివరాలను పొందుపరిచే బాధ్యత కార్యాలయ అధికారి, నోడల్ అధికారిదేనని కలెక్టర్ స్పష్టం చేశారు. పోస్టల్ బ్యాలెట్ విషయంలో ఎన్నికల రోజున విధులు నిర్వహించే పోలింగ్ సిబ్బందికి, ఈ ప్రక్రియలో పాల్గొనే పోలీస్ సిబ్బందికి, సర్వీస్ ఓటర్లకు ఫారం– 12 అందించి దరఖాస్తు చేసుకున్న ఓటర్లకు ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్లో ఓటింగ్ వేసేలా ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. ఫెసిలిటేషన్ సెంటర్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు వచ్చే ఇతర జిల్లా, ప్రాంత సిబ్బందికి ఒక రోజు స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఓటర్లను గుర్తించడం వారికి ఫారం– 12 అందించి జిల్లాలో అత్యధికంగా ఓటింగ్ శాతం పెంచాలని ఆదేశించారు. అలాగే ఫారం– 6, ఫారం– 7, ఫారం– 8 అప్లికేషన్లను పెండింగ్‌లో లేకుండా నిర్ణీత గడువులోగా ఆమోదించాలని అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్లు కుమార్ దీపక్, సీతారామారావు, జిల్లా ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు



లింగాలలో పది విద్యార్థులపై పూలు చల్లి వీడ్కోలు పలుకుతున్న సహచర విద్యార్థులు

నాగర్‌కర్నూల్: పదో తరగతి వార్షిక పరీక్షలు ఈ నెల 18 నుంచి ప్రారంభమై శనివారం ప్రశాంతంగా ముగిశాయని డీఈఓ గోవిందరాజులు తెలియజేశారు. జిల్లాలోని 250 పాఠశాలల్లో చదువుతున్న మొత్తం 10,528 మంది విద్యార్థులు జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 59 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు రాశారు. చివరి రోజు సాంఘిక శాస్త్రం పరీక్షకు 10,503 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని, 25 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని వివరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించిన చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, 10 పరీక్షల్లో పాల్గొన్న అధికారులు, సహకరించిన పోలీస్ మరియు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి, విద్యార్థుల తల్లిదండ్రులకు ఆయన కతజ్ఞతలు తెలియజేశారు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు పరీక్ష కేంద్రాల నుంచి హుషారుగా తమ ఇళ్లకు పయనమయ్యారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతి అందజేస్తున్న ఆంజనేయులు తదితరులు

కల్వకుర్తి రూరల్: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో శనివారం కల్వకుర్తి పట్టణంలో లేబర్ అధికారి మహేందర్‌రావుకు వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడారు. రాష్ట్రంలో 73 విభాగాల్లో కోటి 20 లక్షల మంది కార్మికులు ఉన్నారని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో 2006 నుంచి 2012 మధ్యన వేతన సవరణ జరిగిందన్నారు. 5 సంవత్సరాలకు ఒకసారి సవరణ జరుగాల్సి ఉండగా.. పారిశ్రామిక వేత్తలు వేతనం పెంచలేదన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి పది సంవత్సరాలు పూర్తయినా.. వేతన సవరణ జరగలేదన్నారు. అప్పటి కేసీఆర్ ప్రభుత్వం కాలయాపన చేసి, కార్మికుల శ్రమ దోపిడీకి గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశ్రామిక వేత్తలు రూ.వేల కోట్లు ఆర్జిస్తున్నా.. కార్మికులను పట్టించుకోవడం లేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వేతనాలు పెంచాల్సి పోయి వేతనాలు తగ్గేలా చేయడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన జీఓలను పరిశీలిస్తే.. వేతనాలు పెరిగిన ధరల ఆధారంగా లేదని, ఈ కార్మికులకు అన్యాయం చేసి పరిశ్రమల యజమానులకు మేలు చేసేలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని లేబర్ అధికారికి అందజేశారు. కార్యక్రమంలో యాదయ్య, కృష్ణ, నరేష్, బీరయ్య, పర్వతాలు, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

వేరుశనగ @ రూ.7,169

జడ్చర్ల/ దేవరకద్ర: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం వేరుశనగ క్వింటాలు గరిష్టంగా రూ.7,169, కనిష్టంగా రూ.4,265 ధరలు లభించాయి. అలాగే పొద్దుతిరుగుడు రూ.3,769, పెసర్లు గరిష్టంగా రూ.6,200, కనిష్టంగా రూ.5,801, మొక్కజొన్న గరిష్టంగా రూ.2,239, కనిష్టంగా రూ.1,939, ఆముదాలు గరిష్టంగా రూ.5,851, కనిష్టంగా రూ.5,454, పత్తి గరిష్టంగా రూ.7,009, కనిష్టంగా రూ.5,869, జొన్నలు గరిష్టంగా రూ.5,177, కనిష్టంగా రూ.3,137, రాగులు రూ.4,059, మినుములు రూ.8,710 చొప్పున పలికాయి.

ఆర్ఎన్ఆర్ ధర రూ.2,444

దేవరకద్ర మార్కెట్ యార్డులో శనివారం జరిగిన టెండర్లలో ఆర్ఎన్ఆర్ రకం క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2,444, కనిష్టంగా రూ.2,219 ధరలు వచ్చాయి. హంస రకానికి గరిష్టంగా రూ.1,734, కనిష్టంగా రూ.1,609, ఆముదాలు సరాసరిగా రూ.5,709 పలికింది. మార్కెట్‌కు వరి ధాన్యం సీజన్ ప్రారంభమైంది. దాదాపు వెయ్యి బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది.

మహబూబ్‌నగర్ జెడ్పీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం

- కలెక్టర్‌కు అందజేసిన బీఆర్ఎస్ జెడ్పీటీసీ సభ్యులు



అవిశ్వాస తీర్మానం ఇచ్చిన జెడ్పీటీసీ సభ్యులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో జెడ్పీటీసీ సభ్యులు శనివారం కలెక్టర్ రవినాయక్‌కు అవిశ్వాస తీర్మాన పత్రం అందజేశారు. అనంతరం జెడ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య, జెడ్పీటీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ స్వార్థ రాజకీయాలకు జెడ్పీ చైర్‌పర్సన్ చేసిన పని నిదర్శనం అన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆమెది అవకాశవాద రాజకీయమని బీఆర్ఎస్‌లో లబ్ధి పొంది కాంగ్రెస్ కోవర్టుగా వ్యవహరించాలని విమర్శించారు. ఆమె సొంత మండల కాకపోయినా వేరు మండల నుంచి నిలబెట్టి గెలిపిస్తే ఇలా ద్రోహం చేయడం సరికాదన్నారు. అవిశ్వాసానికి మొత్తం 14 మంది సభ్యుల్లో 13 మంది సభ్యులు అనుకూలంగా ఉన్నారని, వెంటనే ఆమెపై అవిశ్వాసానికి తేదీ ఇవ్వాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జెడ్పీటీసీ సభ్యులు ఇంద్రయ్యసాగర్, శ్రీనివాస్‌రెడ్డి, కల్యాణి, శశిరేఖ, వెంకటేశ్వరి, రాజేశ్వరి, అన్నపూర్ణ, విజయనిర్మల, విజయ్‌భాస్కర్ తదితరులున్నారు.

గలాటా..!

కాంగ్రెస్‌లో ఆధిపత్య పోరు

- గద్వాలలో తారస్థాయికి చేరిన వర్గ విభేదాలు
- మంత్రి జూపల్లి సమక్షంలోనే దాడులు చేసుకున్న వైనం
- బూత్‌స్థాయి శిక్షణలో జెడ్పీ మాజీ చైర్మన్ బండారి భాస్కర్‌పై దాడి
- మూడు రోజుల కిందట హైదరాబాద్‌లోని ఓ రిసార్టులో మాటల యుద్ధం
- జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి మధ్య ముదిరిన వైరం



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/ గద్వాల రూరల్: జోగుళాంబ గద్వాల జిల్లా కాంగ్రెస్ పార్టీలో నేతల మధ్య నెలకొన్న అంతర్గత పోరు రచ్చకెక్కింది. ఏకంగా బూతులు తిట్టుకుంటూ దాడులకు తెగబడ్డారు. ఉమ్మడి జిల్లా జెడ్పీ మాజీ చైర్మన్ బండారి భాస్కర్‌ను కిందకు తోసేసి మరీ దాడి చేసిన సంఘటన గద్వాల జిల్లాకేంద్రంలో చోటుచేసుకుంది. ఇందుకు శనివారం గద్వాలలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి శిక్షణ కార్యక్రమం వేదికైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు కొప్పుల రాజు హాజరు కాగా.. పార్టీ ఎంపీ అభ్యర్థి మల్లురవి, సీనియర్ నాయకులు మందా జగన్నాథం, సంపత్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, జెడ్పీ మాజీ చైర్మన్ బండారి భాస్కర్ పాల్గొన్నారు. ఈ క్రమంలో పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానాలపై నేతలు ప్రసంగించారు. మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ మాట్లాడే సమయంలో తనకు కూడా మైక్ ఇవ్వాలని.. మీరు స్టేజీల మీద ప్రసంగాలు చేస్తే ఓట్లు పడవంటూ బండారి భాస్కర్ తనదైన శైలిలో బూతులు మాట్లాడారు. దీంతో సంపత్‌కుమార్‌తో పాటు అక్కడే ఉన్న ఆయన వర్గీయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే సంపత్‌కుమార్ వర్గీయులు ఆవేశంతో రగిలిపోయి బండారి భాస్కర్ మీదకు దూసుకెళ్లి.. ఆయనను తోసుకుంటూ దాడికి యత్నించారు. ఒకరిపై మరొకరు దాడులు చేసుకోగా బండారి భాస్కర్ కిందపడగా ఒక్కసారిగా మూకుమ్మడి దాడికి పాల్పడ్డారు. ఇదంతా కూడా రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, కొప్పుల రాజు సమక్షంలో జరగడంతో వారు కూడా ఒకింత అవాక్కయ్యారు. వెంటనే మంత్రి జూపల్లి మైక్ తీసుకుని నాయకులు, కార్యకర్తలను సముదాయించే ప్రయత్నం చేశారు. గొప్ప సమావేశంలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం సరైన విధానం కాదని, కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణతో కూడుకున్నదని.. ఎవరి సీటులో వారు కూర్చోవాలంటూ కోరారు. చాలా సేపటి తర్వాత వివాదం సద్దుమణిగింది.

ఎవరికి వారే..

ఈ నెల 28న జరిగిన ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉపఎన్నికలో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, సంపత్‌కుమార్ ఎవరికి వారు తమ వర్గ ప్రజాప్రతినిధులతో బస్సులో పోలింగ్ కేంద్రానికి వచ్చి.. కనీసం పలకరించుకోకుండానే వెళ్లిపోవడం విశేషం. అదేవిధంగా నేతల మధ్య సఖ్యత లేమితో పార్టీ కార్యక్రమాలు సైతం వర్గాలుగా విడిపోయి ఎవరికి వారు ఆధిపత్య ప్రదర్శనకు దిగుతున్నారు. ఈ క్రమంలోనే బండారి భాస్కర్‌పై చోటుచేసుకున్న దాడి నిదర్శనంగా చెప్పవచ్చు. దీనిపై పార్టీ అధిష్టానం స్పందించి ఏ మేరకు నష్ట నివారణ చర్యలు తీసుకుంటుంది అనేది వేచిచూడాలి.

మూడు రోజుల కిందట..

హైదరాబాద్‌లో మూడు రోజుల కిందట కూడా వర్గపోరు బహిర్గతమైంది. ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ ఎన్నిక సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన రిసార్టులో ప్రజాప్రతినిధులకు ఓటు వేయడంపై అవగాహన కల్పించేందుకు మాక్‌పోలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత బండ్ల చంద్రశేఖర్‌రెడ్డికి ఆహ్వానం లేకపోవడంతో ఆయన వర్గం నేత లు మాటల యుద్ధానికి దిగినట్లు తెలిసింది.

భగ్గుమన్న వర్గ విభేదాలు

గద్వాల జిల్లా కాంగ్రెస్ పార్టీలో నేతల మధ్య నెలకొన్న విభేదాలు తారస్థాయికి చేరి దాడులకు దారితీశాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల వరకు అందరూ కలిసికట్టుగా పనిచేశారు. ఎన్నికల ఫలితాల అనంతరం నేతల మధ్య వైషమ్యాలు చోటుచేసుకున్నాయి. ప్రధానంగా జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. దీంతో ఇరువురు నేతలు కూడా వర్గాలుగా విడిపోయి ఎడమొహం పెడమొహంగా కొనసాగుతూ వస్తున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర స్థాయి పార్టీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ ఎమ్మెల్యేలు లేనిచోట్ల ఓటమి చెందిన అభ్యర్థులే ఇన్‌చార్జ్‌లుగా కొనసాగుతారని స్పష్టం చేశారు. దీంతో జిల్లాలోని అలంపూర్‌లో సంపత్‌కుమార్, గద్వాలలో జెడ్పీచైర్‌పర్సన్ సరిత నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. పార్టీతో పాటు ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ కీలకపాత్ర పోషిస్తున్నారు. అధికారుల బదిలీలు, ప్రభుత్వ కార్యక్రమాలను చక్కబెడుతున్నారు. అయితే గద్వాలలో తమకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్ సరితపై అసంతృప్తిగా ఉన్నారు. మరోవైపు అలంపూర్ అసెంబ్లీ టికెట్ ఆశించి భంగపడ్డ బండారి భాస్కర్ సైతం సంపత్ కుమార్‌పై అసంతృప్తిగా ఉన్నారు.



మాజీ జెడ్పీచైర్మన్ బండారి భాస్కర్‌పై దాడి చేస్తున్న సంపత్‌కుమార్ వర్గీయులు

క్లుప్తంగా

గొంతులో చేప ఇరుక్కొని వ్యక్తి మృతి


పాత్లావత్ నీల్యా (ఫైల్)

బాలానగర్: చెరువులో చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి గొంతులో ఓ చిన్న చేప ఇరుక్కపోవడంతో ఊపిరాడక మృత్యువాత పడ్డ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలంలోని మోతీఘనపురంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మేడిగడ్డతండాకు చెందిన పాత్లావత్ నీల్యా (48) శనివారం స్థానికులతో కలిసి మోతీఘనపురం పెద్దచెరువులో చేపల వేటకు వెళ్లాడు. అతను వేసిన వలలో ఓ చిన్న చేప మాత్రమే చిక్కడంతో దానిని బయటికి తీసి, నోటితో కరిచి పట్టుకొని.. మళ్లీ నీటిలో వేసేందుకు వలను సరిచేసే ప్రయత్నం చేశాడు. ఈ సమయంలో నోట కరుచుకున్న చేప.. గొంతులోకి దూరింది. గమనించిన తోటి వ్యక్తులు అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి, చేపను బయటికి తీసేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. అప్పటికే అతడు ఊపిరాడక మృతి చెందాడు. మృతుడికి భార్య మారోని, ఇద్దరు కుమారులు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. నీల్యా మృతితో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రైల్లో నుంచి జారిపడి వృద్ధుడు మృతి

మదనాపురం: మండలంలోని అజ్జకొల్లు సమీపంలో రైల్లో నుంచి జారి పడి గుర్తు తెలియని వృద్ధుడు మృతిచెందిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. 75 నుంచి 80 ఏళ్ల వృద్ధుడు వనపర్తి రోడ్డు శ్రీరాం నగర్ స్టేషన్ల మధ్య అజ్జకొల్లు శివారులో పట్టాల పక్కన లోతట్టు ప్రాంతంలో చనిపోయి కనిపించాడు. రైలులో వెళ్తున్న సమయంలో ప్రమాదవశాత్తు జారి పడ్డాడని, రెండు రోజుల క్రితం ఘటన జరిగినట్లు తెలిపారు. గ్రామస్తుల ద్వారా సమాచారం తెలియడంతో వెళ్లి పరిశీలించామని మృతుడు తెల్లటి పంచ, తెలుపు, ముదురు గోధుమ రంగుల నిలువుగీతల ఫుల్ షర్టు ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. ఎలాంటి గుర్తింపు ఆధారాలు లేవని, వివరాలకు 8309067184, 8712658608 నంబర్లను సంప్రదించాలని కోరారు.

రైలు కింద పడి యువకుడు బలవన్మరణం


నరేంద్ర(ఫైల్)

ఉండవెల్లి: మండలంలోని రైల్వే అండర్ బ్రిడ్జ్ పక్కన ఉన్న రైలు పట్టాలపై ఎదురుగా రైలు వస్తున్న క్రమంలో కంచుపాడుకి చెందిన నరేంద్ర(18) బలవన్మరణానికి పాల్పడినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపారు. శనివారం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కంచుపాడుకి చెందిన నాగలక్ష్మమ్మకు ముగ్గురు కుమారులు. అందులో రెండో కుమారుడు నరేంద్ర అలియాస్ నందు కృష్ణవేణి ఐటీఐ కాలేజీలో రెండో సంవత్సరం చదవుతూ.. కర్నూల్ పట్టణంలోని మౌలాలి వద్ద వాటర్ సర్వీస్ చేస్తుండేవాడు. శనివారం మధ్యాహ్నం భోజనానికి సొంత గ్రామానికి వెళ్లొస్తానని చెప్పి వెళ్లిపోయాడు. జాతీయ రహదారిలోని రైల్వే అండర్ బ్రిడ్జ్ పక్కన రైలు పట్టాలపై మధ్యాహ్నం 12.30 గంటలకు రైలు కింద పడి చనిపోతున్నాని అతని వెంట కర్నూల్ షాప్‌లో పనిచేస్తున్న స్నేహితుడు సాయి కుమార్‌కు ఫోన్లో తెలియజేశాడు. అతను వచ్చే లోపు నరేంద్ర రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలియజేశారు. సంఘటన స్థలానికి ఎస్ఐ శ్రీనివాసులు చేరుకుని పరిశీలించారు. మృతుదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు వివరించారు.

బావిలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

గద్వాల క్రైం: ప్రమాదవశాత్తు బావిలో పడి ఒకరు మృతి చెందినట్లు పట్టణ రెండో ఎస్ఐ రాము తెలిపారు. శనివారం సాయంత్రం పట్టణంలోని లింగబావిలో ఓ గుర్తు తెలియని వ్యక్తి(40) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందినట్లు స్థానికులు సమాచారం అందించారన్నారు. సంఘటన స్థలం వద్దకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. విచారణ చేపట్టి పూర్తి వివరాలు తెలియజేస్తామని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

జడ్చర్ల: మహబూబ్‌నగర్ జిల్లా మండల పరిధిలోని ఆల్వాన్‌పల్లి సమీపంలో 167 నంబర్ జాతీయరహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఎస్ఐ చంద్రమోహన్ కథనం మేరకు.. మిడ్జిల్ మండలం అయ్యవారిపల్లికి చెందిన మహేశ్(30) శుక్రవారం రాత్రి మోటార్ బైక్‌పై తమ స్వగ్రామం నుంచి జడ్చర్లకు బయల్దేరాడు. ఆల్వాన్‌పల్లి సమీపంలో వస్తుండగా.. ముందు వెళ్తున్న వాహనం డ్రైవర్ అతివేగంగా వెళ్తున్న సమయంలో ఆకస్మికంగా బ్రేకులు వేశాడు. దీంతో వెనుక వస్తున్న మహేస్ బైక్ ఆ వాహనాన్ని బలంగా ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వైద్య చికిత్స కోసం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృత్యువాత పడ్డాడు. మృతుడి తండ్రి కొర్వల్లి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వేతన వెతలు


జడ్చర్ల ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు సమ్మె నోటీస్ అందజేస్తున్న కార్మికులు

- వైద్య విధాన పరిషత్ కార్మికులకు 6 నెలలుగా అందని వేతనాలు
- గేతడాది జూన్ నుంచి విడుదలకాని బడ్జెట్
- కుటుంబాలు గడవక కార్మికుల అవస్థలు
- రేపటినుంచి నిరవధిక సమ్మెకు పిలుపు

జడ్చర్ల టౌన్: వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కార్మికులకు 6 నెలలుగా వేతనాలు అందక అవస్థలు పడుతున్నారు. ఇచ్చే అరకొర వేతనాలను సైతం నెలనెలా చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో వైద్య విధాన పరిషత్ పరిధిలో జడ్చర్ల ఏరియా ఆస్పత్రి, బాలానగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లు ఉన్నాయి. ఇంటిగ్రేటెడ్ హాస్పిటల్ ఫెసిలిటి మేనేజ్‌మెంట్ సర్వీసెస్ టెండర్ల ద్వారా జడ్చర్ల ఆస్పత్రిని శ్రీశాంతి ఏజెన్సీ, బాలానగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను వెంకటయ్య ఏజెన్సీలు దక్కించుకున్నాయి. జడ్చర్ల ఆస్పత్రిలో 30 మంది, బాలానగర్‌లో ఏడుగురు కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి 6 నెలలుగా వేతనాలు రావడం లేదు. వాస్తవానికి 2023 జూన్ నుంచి నేటి వరకు ప్రభుత్వం నుంచి కార్మికుల వేతనాల బడ్జెట్ విడుదల కాలేదని తెలుస్తోంది. కార్మికులు, యూనియన్ నాయకుల ఒత్తిడి మేరకు మూడు నెలలపాటు వేతనాలు ఇచ్చామని.. ఇక ఇవ్వలేమని ఆయా ఏజెన్సీలు చేతులెత్తేశాయి. దీంతో కుటుంబాలను పోషించుకోలేక కార్మికులు అష్టకష్టాలు పడుతున్నారు.

జడ్చర్ల ఆస్పత్రి ఎదుట ధర్నా..

పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం జడ్చర్ల ఆస్పత్రి ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం వెంటనే బడ్జెట్ విడుదల చేయాలని నినాదాలు చేశారు. అనంతరం సూపరింటెండెంట్ డా.సోమశేఖర్‌కు సమ్మె నోటీస్ అందజేశారు. సోమవారం నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నట్లు ప్రకటించారు.

ఆస్పత్రిలో వీరిదే కీలకం..

ఆస్పత్రుల్లో రోగులకు సేవలు అందించడంలో కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారు. వీరు సమ్మెలోకి వెళ్తే, ఆస్పత్రిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిలిచిపోవడంతో పాటు ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయి ఆస్పత్రిలో రోగులకు మరిన్ని రోగాలు తెచ్చిపెట్టే ప్రమాదం ఉంది. పర్యవేక్షణ లేకపోవడం వల్ల రోగులు ఇష్టానుసారంగా వ్యవహరించే ఆస్కారం ఉంది.

పండుగల సమయంలో..

ఏప్రిల్ రెండవ వారంలో ఉగాది, రంజాన్ లాంటి పెద్ద పండుగలు ఉన్నాయి. ఆరునెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉండటం వల్ల కార్మికులు ఇప్పటికే ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పండుగలకు సైతం వేతనాలు రాకుంటే ఎలా గడిపేది అంటూ ఆందోళన చెందుతున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె..

వైద్య విధాన పరిషత్‌లో గతేడాది జూన్ నుంచి బడ్జెట్ విడుదల చేయకపోవడంతో కార్మికులకు 6 నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. బడ్జెట్ విడుదల చేయాలని డిమాండ్‌చేస్తూ, సోమవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నాం. జిల్లాలోని జడ్చర్ల ఏరియా ఆస్పత్రి, బాలానగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల కార్మికులు సమ్మెలో పాల్గొంటున్నారు.

– సురేష్, రాష్ట్ర కార్యదర్శి, తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్

హైవేపై అండర్ బ్రిడ్జిలు


వేముల స్టేజీ వద్ద హైవేపై అండర్ బ్రిడ్జి నిర్మించాల్సిన ప్రదేశం

- ఐదు చోట్ల పనులకు కొనసాగుతున్న టెండర్ ప్రక్రియ
- అగ్రిమెంట్లు పూర్తయితే నాలుగు నెలల్లో ప్రారంభం కానున్న పనులు
- ఆరులైన్లకు అనుగుణంగానే పనులు


జానంపేట వద్ద హైవేపై అండర్ బ్రిడ్జి నిర్మించాల్సిన ప్రదేశం

అడ్డాకుల: మూడేళ్లుగా అప్పుడు, ఇప్పుడంటున్న బ్రిడ్జిల నిర్మాణాల కోసం ప్రస్తుతం టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. 44వ నంబర్ జాతీయ రహదారిపై త్వరలో అండర్ బ్రిడ్జిల పనులు ప్రారంభమయ్యే అవకాశం కనిపిస్తోంది. టెండర్ల ప్రక్రియ పూర్తయితే మూడు, నాలుగు నెలల్లో బ్రిడ్జిల నిర్మాణం పనులు ప్రారంభం కానున్నాయి. జాతీయ రహదారిపై ఎక్కువ ప్రమాదాలు జరిగే ప్రదేశాలను ఎన్‌హెచ్ఏఐ గుర్తించింది. అవసరమైన చోట రోడ్డు క్రాసింగ్‌లు లేకుండా అండర్ బ్రిడ్జిలను నిర్మించి వాటి కింద వాహనాలు రోడ్డు దాటేలా అండర్ బ్రిడ్జిలను నిర్మించనున్నారు. కొత్తగా నిర్మించే అండర్ బ్రిడ్జిలతో రోడ్డు క్రాసింగుల వద్ద ప్రమాదాలను అరికట్టే అవకాశం ఉంది.

ఐదు అండర్ బ్రిడ్జిలకు నిధులు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కొత్తూర్ నుంచి అలంపూర్ వరకు సుమారు 180 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి విస్తరించి ఉంది. ఇందులో ప్రస్తుతం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నుంచి వనపర్తి జిల్లాలోని కొత్తకోట వరకు వేస్ట్రన్ ఆంధ్రా టోల్‌వేస్ పరిధిలో సుమారు 55 కిలోమీటర్ల రహదారి ఉండగా అందులో ఎక్కువ ప్రమాదాలు జరిగే 14 బ్లాక్ స్పాట్లను ఎన్‌హెచ్ఏఐ అధికారులు గుర్తించారు. వాటిలో ఐదు చోట్ల అండర్ బ్రిడ్జిలను నిర్మించాలని ఎన్‌హెచ్ఏఐ నిర్ణయించింది. వనపర్తి జిల్లాలోని కొత్తకోట మండలం కనిమెట్ట, పెద్దమందడి మండలంలోని వెల్టూర్ స్టేజీ, మూసాపేట మండలంలోని వేముల స్టేజీ, జానంపేట బస్‌స్టాప్, భూత్పూర్ మండలంలోని శేర్‌పల్లి(బీ) వద్ద జాతీయ రహదారిపై అండర్ బ్రిడ్జిలను నిర్మించడానికి నిధులు మంజూరు చేయడంతో టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది.

ఉన్నదాంట్లోనే విస్తరణ..

జాతీయ రహదారిని నాలుగు లైన్లుగా విస్తరించేటప్పుడే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అప్పటి ప్రభుత్వం భూసేకరణ చేసి ఆరులైన్ల కోసం అవసరమైన స్థలానికి పరిహారం చెల్లించి తమ ఆధీనంలో ఉంచుకుంది. అప్పుడు రహదారిని నాలుగు లైన్లుగా విస్తరించి మిగిలిన స్థలాన్ని రోడ్డు పక్కన ఎవరు స్వాధీనం చేసుకోకుండా ఎప్పటికప్పుడు రోడ్డు నిర్వాహకులు పర్యవేక్షణ చేస్తున్నారు. రహదారి స్థలంలో ఎవరైనా హోటళ్లు, డబ్బాలు వేసుకుంటే వెంటనే వాటిని తొలగించి రక్షణ కంచెను ఏర్పాటు చేస్తుండటంతో ఎక్కడా రహదారి స్థలం కబ్జాకు గురికాలేదు. ఇప్పుడు అదే స్థలంలో ఆరులైన్ల రహదారి పనులు చేయనున్నారు. పెద్ద జంక్షన్ల వద్ద అత్యవసరమైతే తప్పా.. ఎక్కడ కూడా కొత్తగా సెంటు స్థలాన్ని సేకరించే అవకాశం లేదని అధికారులు పేర్కొంటున్నారు. రహదారి పక్కన స్థలాలు ఉన్న వారు తమ స్థలాలను సేకరించి రోడ్డు వేస్తారేమోనన్న ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని చెబుతున్నారు.

ఆరులైన్లకు అనుగుణంగా పనులు..

హైదరాబాద్ నుంచి బెంగళూర్ వరకు జాతీయ రహదారి ప్రస్తుతం నాలుగు లైన్లుగా ఉంది. దీన్ని ఆరులైన్లుగా విస్తరించడానికి కేంద్ర ప్రభుత్వం అంతా సిద్ధం చేసింది. ఇందుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. టెండర్ వేసిన సంస్థలు అగ్రిమెంట్ చేసుకునే దశలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే జాతీయ రహదారిని నాలుగు లైన్ల నుంచి ఆరులైన్లకు విస్తరించే పనులు కొంత ఆలస్యమయ్యే అవకాశం ఉంది. ఆరులైన్ల పనుల కంటే ముందే అండర్ బ్రిడ్జిల పనులు ప్రారంభం కానున్నాయి. అయితే ఇప్పుడు చేపట్టే బ్రిడ్జిల పనులు ఆరులైన్లకు అనుగుణంగా ఉండనున్నాయి. ఆరులైన్ల పనులు మొదలైనప్పుడు ఇప్పుడు నిర్మించే బ్రిడ్జిల వద్ద పనులు చేయాల్సిన అవసరం లేకుండా ఆరు వరుసలకు అనుగుణంగా బ్రిడ్జిల పనులు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా.. ఐదు అండర్ బ్రిడ్జిలే కాకుండా ఆరు లైన్ల పనులు మొదలైనప్పుడు ఎక్కడ కూడా వాహనాలు రోడ్డు క్రాస్ చేయకుండా అవసరమైన అన్నిచోట్లా అండర్ బ్రిడ్జిలోనే రోడ్డు దాటేలా నిర్మాణం జరుగనుందని తెలుస్తోంది.

పలు చోట్ల నగదు పట్టివేత


కృష్ణా చెక్‌పోస్టులో సీజ్ చేసిన నగదుతో పోలీసులు


బాలానగర్‌లో పట్టుబడిన నగదును చూపుతున్న పోలీసులు

కృష్ణా: మండలంలోని రాష్ట్ర సరిహద్దులో గల చెక్‌పోస్టులో శనివారం ఎస్ఐ నవీన్, ఏఎస్ఐ సురేంద్ర బాబు ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేపట్టారు. రాయచూర్ నుంచి వస్తున్న జహీరుద్దీన్ కారులో రూ.1.50లక్షల నగదు లభించిందని, వాటికి ఎలాంటి ధ్రువపత్రాలు లేనందున సీజ్ చేసినట్లు తెలిపారు.

రూ.2.20 లక్షల నగదు..

బాలానగర్: మండల కేంద్రంలో ఏర్పాటు చేసి చెక్‌పోస్టులో శనివారం నంద్యాల జిల్లా ప్యాపిలికి చెందిన ఓబయ్య వద్ద రూ.2.20లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తిరుపాజీ తెలిపారు.

అమరచింత: నాగల్‌కడ్మూర్ వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టులో శనివారం వాహనాలను తనిఖీ చేస్తుండగా చాకలి బలరాం నుంచి రూ.99వేలు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ సురేష్‌కుమార్ తెలిపారు.

అలంపూర్: పుల్లూరు చెక్‌పోస్టు వద్ద కర్నూల్ జిల్లా పత్తికొండ మండలం పేరవల్లికి చెందిన రామచంద్ర నుంచి రూ.1.85లక్షల నగదును శనివారం పట్టుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. రామచంద్రుడు మహబూబ్‌నగర్‌లో ఉద్యోగం చేస్తారని తన పొలాన్ని కౌలుకు ఇచ్చి నగదును తీసుకొస్తుండగా తనిఖీలో పట్టుబడినట్లు తెలిపారు. నగదును జిల్లా గ్రీవెన్స్ సెల్‌కు తరలించినట్లు ఎస్ఐ వివరించారు.

పట్టపగలే ఇంట్లో చోరీ

రూ.3.80లక్షలు నగదు ఎత్తుకెళ్లిన దుండగులు

ధరూరు: ఇంటికి తాళం వేసి శుభకార్యానికి వెళ్లగా దొంగలు చొరబడి నగదును ఎత్తుకెళ్లిన ఘటన మండలంలోని దోర్నాలలో చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాలిలా.. గ్రామానికి చెందిన ఉప్పిని రాజశేఖర్ శుక్రవారం ఉదయం బంధువుల పెళ్లి ఉండడంతో మరికల్ మండలం జిన్నారంకు కుటుంబమంతా కలిసి వెళ్లారు. సాయంత్రం రాజశేఖర్ కుమారుడు నవకాంత్ ఇంటికి వచ్చాడు. అప్పటికే ఇంటి తాళం తెరిచి ఉండటాన్ని గమనించి ఇంట్లో వెళ్లి చూడగా, ట్రంకు పెట్టెలో దాచి ఉంచిన రూ.3.80లక్షల నగదు కనిపించలేదు. రెండు రోజుల క్రితమే రాయచూరుకు చెందిన బసవరాజు మామిడి తోట లీజుకు ఇచ్చిన డబ్బులు ఇంట్లో ఉంచి, పెళ్లికి వెళ్లి వచ్చే సరికి చోరీ జరగడంతో కుటుంబ సభ్యులు బోరుమన్నారు. శనివారం బాధితుడు రాజశేఖర్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

కోస్గి: మున్సిపల్ పరిధిలోని పోతిరెడ్డిపల్లిలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఏడుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేశారు. సీఐ సోమ నర్సయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పోతిరెడ్డిపల్లిలో కొంత కాలంగా పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారం వచ్చింది. దీంతో శనివారం సిబ్బందితో కలిసి ఆకస్మిక దాడి చేసి, పేకాట ఆడుతున్న ఏడుగురుని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. పేకాట స్థలంలో రూ.8,030 నగదు సైతం దొరికిందన్నారు. పట్టుబడిన వారిపై కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇందులో ఎస్ఐ శేఖర్ గౌడ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

తగ్గుతున్న నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో నీటిమట్టం తగ్గుతుంది. శనివారం 1,011 అడుగులకు చేరింది. జూరాల ఎడమ, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నారు.

ధాన్యం దొంగల రిమాండ్


చోరీల వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి

పెబ్బేరు రూరల్: వనపర్తి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వరి ధాన్యం చోరీ చేసిన నలుగురిని పెబ్బేరు మండలంలోని రంగాపురం బైపాస్ వద్ద అరెస్టు చేసి శనివారం రిమాండ్ చేశామని ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల పట్టణానికి చెందిన ప్రవీణ్‌రెడ్డి, రాజు, ఎండీ సమీర్, ఎండీ యాసిన్ వనపర్తి జిల్లాలోని కొత్తకోట, చిన్నంబావి, పెబ్బేరు, వీపనగండ్ల, శ్రీరంగాపురం ప్రాంతాల్లో రైతులు పంట పొలాల వద్ద, మిల్లుల వద్ద ఆరబోసుకున్న వరి ధాన్యాన్ని పగలు గమనించి రాత్రి పూట చోరీ చేసి అమ్ముకొని సొమ్ము చేసుకున్నారు. దీన్నే వృత్తిగా ఎంచుకొని జీవనం గడుపుతున్నారు. శనివారం రంగాపురం బైపాస్ వద్ద వాహనాల తనిఖీలు చేస్తుండగా.. బొలెరో వాహనంలో వెళ్తున్న నలుగురిని పోలీసులు ఆపి వివరాలు అడిగారు. సరైన సమాధానం చెప్పక పోవడంతో స్టేషన్‌కు తరలించి విచారించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వరి ధాన్యం చోరీ చేశామని ఒప్పుకొన్నారు. వీరిపై జిల్లాలోని కొత్తకోట, చిన్నంబావి, పెబ్బేరు పోలీస్ స్టేషన్లలో తొమ్మిది కేసులు ఉన్నట్లు గుర్తించారు. వారి వద్ద రూ. 3.45 లక్షల నగదు స్వాధీనం చేసుకొని వారి వాహనాన్ని చేశారు. ప్రవీణ్‌రెడ్డి, రాజు, ఎండీ సమీర్, ఎండీ యాసిన్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

సేంద్రియ ఎరువుల్లో పోషకాలు


వర్మీ కంపోస్టు ఎరువు


కోళ్ల ఎరువు

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: పంటల సాగులో కొన్నేళ్లుగా రసాయానికి ఎరువుల వాడకం పెరిగింది. దీని వలన నేల తన సహజత్వాన్ని కోల్పోయి, భూసారం క్షీణిస్తుంది. దీంతో అనుకున్న స్థాయిలో పంటల దిగుబడి రాక నష్టపోవాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. పంట ఉత్పత్తుల్లోనూ రసాయానికి ఎరువులు, పురుగు మందుల అవశేషాలు ఉండి ప్రజా ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. ఈ పరిస్థితుల్లో నేల సంరక్షణకు సేంద్రియ పోషకాల అవసరం ఎక్కువగా ఉంటుందని ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు సూచించారు. రసాయానిక ఎరువులు తగ్గించి వాటి స్థానంలో పశువులు, గొర్రెలు, మేకల, కోళ్ల ఎరువులు, వేప కానుగలాంటి వృక్ష సంబంధిత ఎరువులు వర్మి, పచ్చి రొట్టె ఎరువులు వేయాలి. భూమిలో పోషకాల లభ్యతకు అనుగుణంగా ఎరువుల యాజమాన్యం చేపట్టాలి. సేంద్రియ ఎరువుల్లో స్థూల పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాష్ శాతం ఎంత ఉందని తెలుసుకోవాలి. దీనిని బట్టి సేంద్రియ ఎరువులు పంటకు వేయాలి. ఇలా చేయడం వలన భూమి సారవంతం కావడంతోపాటు పెట్టుబడి తగ్గి పంటల దిగుబడి పెరిగే అవకాశం ఉంటుంది.

సేంద్రియ ఎరువుల్లో నత్రజని, భాస్వరం, పోటాష్ శాతం

సేంద్రియ ఎరువులు	నత్రజని శాతం	భాస్వరం శాతం	పోటాష్ శాతం
పశువుల ఎరువు	1.5	0.9	1.9
కోళ్ల ఎరువులు	3.0	2.0	2.0
గొర్రెల/మేకల	0.7	0.6	3.0
వర్మీ కంపోస్టు	3.0	2.2	1.7
చెరుకు మడ్డి	1.5	4.5	7.0
గోబర్ గ్యాస్ ప్లాంట్	2.4	1.5	1.0
గ్రామీణ కంపోస్టు	1.0	0.8	1.2
పట్టణ కంపోస్టు	2.0	3.3	2.0
వేరుశనగ పిండి, చెక్క	7.5	1.3	1.5
వేప పిండి	5.6	1.1	1.5
ఆముదం పిండి	4.4	1.9	1.4
కానుగ పిండి	4.0	1.0	1.4
పత్తి గింజల పిండి	3.6	2.5	1.6
పంది ఎరువు	3.75	3.13	2.5
జీలుగ	0.62	0.15	0.46
జనుము	0.75	0.12	0.15
చేపల పొట్టు	4.1	3.1	0.3
అలసంద	0.71	0.15	0.58
పిల్లి పెసర	0.72	0.10	0.53


జీలుగ ఎరువు

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

కోయిల్‌కొండ: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధమైన ఘటన కోయిల్‌కొండ మండలం కొత్లాబాద్‌లో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గొల్లఎలుక మల్లయ్య, చెన్నమ్మ గుడిసెలో ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు చెలరేగాయి. స్థానికులు ఆర్పివేసేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. రూ. 10వేల నగదు, క్వింటాల్ బియ్యం, నిత్యావసర సామగ్రి దగ్ధమయ్యాయి. దాదాపు రూ. 60వేలకు పైగా నష్టం వాటిల్లిందని బాధిత కుటుంబ సభ్యులు వాపోయారు. పంచాయతీ కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి శనివారం పంచనామా నిర్వహించారు. బాధిత కుటుంబానికి రూ.1100 నగదు, నిత్యావసర వస్తువులు, 50 కిలోల బియ్యం అందజేశారు.

చీటింగ్ కేసులో ఐదుగురికి రిమాండ్

ఖిల్లాఘనపురం: తప్పుడు పత్రాలతో భూమి విక్రయించిన ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ శ్రీహరి శనివారం తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. మండలంలోని కమాలొద్దీన్‌పూర్ శివారులో రజియా సుల్తానాకు ఐదెకరాల వ్యవసాయ భూమి ఉంది. ఆమెకు తెలియకుండా గద్వాలకు చెందిన మౌలానా, షమీ, అజీజ్ అహ్మద్, హైదరాబాద్‌కు చెందిన అక్సర్ అలీఖాన్, షఫీ తప్పుడు పత్రాలు సృష్టించి.. 2023 అక్టోబర్ 2న కమాలొద్దీన్‌పూర్‌కు చెందిన రామకృష్ణారెడ్డికి విక్రయించారు. కొన్ని రోజులకు భూమి అసలు యజమాని రాగా.. రామకృష్ణారెడ్డి కాస్తులోకి వచ్చాడు. ఇది గమనించిన ఆమె భూమికి సంబంధించిన పత్రాలు చూపించింది. అసలు విషయాన్ని తెలుసుకున్న రామకృష్ణారెడ్డి, తనను మోసగించి భూమిని అంటగట్టారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఐదుగురిపై చీటింగ్ కేసు నమోదుచేసి, వనపర్తి కోర్టులో హాజరుపర్చగా.. రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.



మూసీ సుందరీకరణకు రూ.60 వేల కోట్లు



- జోన్ల వారీగా వాణిజ్య అనుమతులతో నిధుల సమీకరణ
- ప్రతి రోజూ 1–2 టీఎంసీల నీటి విడుదలతో మూసీ శుద్ధి
- నదికి ఇరువైపులా కిలోమీటర్ మేర ఇంపాక్ట్ ఏరియా
- 10 వేలకు పైగా ఆక్రమణలే మూసీ సుందరీకరణకు అడ్డంకులు

ప్రాజెక్టు తొలి దశ అంచనా వ్యయమిలా

వెస్ట్ కారిడార్- ఈస్ట్ కారిడార్ వరకు రోడ్డు నిర్మాణానికి రూ.15,000 కోట్లు	ట్రంక్ లైన్‌కు రూ.3,000 కోట్లు
రివర్ లింకేజీకి రూ.3,000 కోట్లు	
మూసీ మొత్తం పరీవాహక ప్రాంతం: 110 చ.కి.మీ.	ఆక్రమణలున్న ప్రాంతం: 55 చ.కి.మీ.

సాక్షి, హైదరాబాద్: మూసీ సుందరీకరణ ప్రాజెక్టు అంచనా వ్యయం అక్షరాలా రూ.60 వేల కోట్లు. దశల వారీగా మూసీని ప్రక్షాళన చేయాలని నిర్ణయించిన సర్కారు.. నది సుందరీకరణ, నిర్వహణ కోసం నిధుల సమీకరణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తోంది. 2050 మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా నది పరిసరాలను జోన్ల వారీగా విభజించి వాణిజ్య కార్యకలాపాలను అనుమతించడం ద్వారా నిధులను సమీకరించాలని భావిస్తోంది. దీనికి అనుగుణంగా మూసీ వెంట రవాణా కారిడార్లు, లాజిస్టిక్ హబ్‌లను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. నదీ గర్భం నుంచి ఇరువైపులా కిలోమీటరు మేర ఇంపాక్ట్ ఏరియాగా ప్రకటించాలని సూత్రప్రాయంగా నిర్ణయించిన మూసీ సుందరీకరణ ప్రాజెక్టు యంత్రాంగం.. ఇప్పటికే నది హద్దులు, ఆక్రమణలపై ప్రాథమికంగా సర్వే నిర్వహించింది. ఈ సర్వే ఆధారంగా జీఐఎస్ మ్యాపింగ్‌ను చేసింది.

ఆక్రమణలే అడ్డంకి..

మూసీ రివర్ ఫ్రంట్‌ను పునరాభివృద్ధి చేయాలనే ఆలోచన తొలుత 1908లోనే వచ్చింది. 1990లో కాస్త ముందుకు కదిలినా.. పూర్తిస్థాయిలో పురోగతి సాధించలేదు. మురుగునీరు, ఆక్రమణలే మూసీ పునరుజ్జీవానికి ప్రధాన అడ్డకుంలుగా నిలిచాయి. 55 కి.మీ మేర నదీ మార్గంలో ఉన్న ఆక్రమణలను తొలగించడం ప్రభుత్వానికి కష్టతరమైన పనే అని అంటున్నారు. నది పునరుజ్జీవం కావడానికి 15–20 ఏళ్ల సమయం పడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఆక్రమణలు సుమారు 2వేల మేర ఉంటాయని అంచనా వేసిన యంత్రాంగం.. వీటిని తొలగించేందుకు ఎలాంటి న్యాయపరమైన అడ్డంకులు లేనప్పటికీ, కొన్నిచోట్ల పట్టా భూముల్లో వెలిసిన నిర్మాణాల విషయంలో మాత్రం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించింది. ఇలాంటి కట్టడాలు 10వేల వరకు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించింది. భూ సేకరణ చట్టం కింద వీరికి పరిహారం చెల్లించడమా? ల్యాండ్ పూలింగ్ ద్వారా సేకరించడమా? ఇతర మార్గాలేమిటనే కోణంలో అధ్యయనం చేస్తోంది. పాతబస్తీలో మూసీ కుచించుపోయిందున ఇక్కడ ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించే ఆలోచన కూడా చేస్తోంది.

జంట జలాశయాల నుంచి రోజూ నీరు

గుజరాత్‌లో నర్మదా నది నీటిని సబర్మతికి తీసుకెళ్లిన మాదిరే గోదావరిని ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ జంట జలాశయాలకు అనుసంధానం చేయాలనేది ప్రణాళిక. మురుగునీటితో నిండి ఉన్న మూసీ నదికి ఈ జంట జలాశయాల నుంచి నీటిని విడుదల చేస్తారు. ఇలా రోజుకు 1–2 టీఎంసీల జలాల విడుదలతో మురుగు శుద్ధి జరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. వరద నీరు, మురుగు నీరు కూడా నదిలో కలుస్తున్నందున మూసీ కలుషితం అవుతుందని తేలడంతో అమృత్ పథకం కింద 39 మురుగునీటి శుద్ధీకరణ ప్లాంట్ (ఎస్టీపీ)లను నిర్మిస్తోంది. వీటిద్వారా వందశాతం శుద్ధి చేసిన నీటిని నదిలోకి విడుదల చేస్తారు. వీటికి అనుబంధంగా ప్రతి రోజు జంట జలాశయాల నుంచి నీటిని వదలడం ద్వారా నదీలో స్వచ్ఛమైన నీరు ప్రవహించేలా.. సందర్శకులను ఆకర్షించేలా రూపొందిస్తారు. మార్గమధ్యంలో పార్కులు, బోటింగ్ కూడా ఏర్పాటు చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది.

సబర్మతి.. మూసీ

కృష్ణా నదికి ఉపనది అయిన మూసీ వికారాబాద్ జిల్లా అనంతగిరి కొండలో పుట్టి.. నార్సింగి ఔటర్ రింగ్‌రోడ్డు నుంచి గౌరెల్లి ఓఆర్ఆర్ వరకు 55 కి.మీ. మేర ప్రవహిస్తుంది. దేశంలోనే నది పునరాభివృద్ధి ప్రాజెక్ట్‌ల్లో మూసీ రివర్ ఫ్రంట్ అత్యంత ప్రతిష్టాత్మకం. నీటి నిర్వహణ, ప్రణాళిక, రవాణా, పునరావాసం, పట్టణ పునరుజ్జీవం తదితరాల కోసం రూ.60 వేల కోట్ల వ్యయం, సుమారు 36 నెలల సమయం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. గుజరాత్‌లోని సబర్మతి నది పునరాభివృద్ధికి మూసీకి దగ్గరి పోలికలున్నాయి, కాకపోతే సబర్మతి అహ్మదాబాద్ నగరంలో 11 కి.మీ. మేర మాత్రమే విస్తరించి ఉండగా.. మూసీ నది హైదరాబాద్‌లో 55 కి.మీ. మేర ప్రవహిస్తుంది. అదీగాక సబర్మతి కంటే మూసీ పరీవాహక ప్రాంతాలు ఎక్కువ ఆక్రమణకు గురవడంతోపాటు జనసాంద్రత కలిగిన ప్రాంతాలు కావడం గమనార్హం.

క్లుప్తంగా...

సీపీఎం తొలి జాబితా విడుదల

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలకు సీపీఎం అభ్యర్థుల తొలి జాబితాను ఆ పార్టీ శనివారం విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 44 స్థానాలకు అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ నుంచి ఒకరిని, తెలంగాణ నుంచి ఒకరిని మాత్రమే ఎంపిక చేసింది. ఏపీలోని అరకు లోక్‌సభ అభ్యర్థిగా పాచిపెంట అప్పల నరస పేరును, తెలంగాణలోని భువనగిరి లోక్‌సభ అభ్యర్థిగా ఎండీ జహంగీర్ పేర్లను ఖరారు చేసింది. అత్యధికంగా పశ్చిమ బెంగాల్ నుంచి 17 మందిని, కేరళ నుంచి 15 మందిని అభ్యర్థులుగా ప్రకటించింది.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్సీ సతీశ్

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సతీశ్‌కు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ భవన్‌ను స్టార్ హోటల్‌గా మార్చుకోండి

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



సాక్షి, హైదరాబాద్: పార్లమెంటు ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీ కనుమరుగు కాబోతుందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ఇప్పటికే ఆపార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు మొహం చాటేస్తున్నారని, సీఎం రేవంత్‌రెడ్డి తలుచుకుంటే 24 గంటల్లో బీఆర్ఎస్ నుంచి ఖాళీ అవుతారని చెప్పారు. గాంధీభవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ భవన్‌గా ఉన్న పార్టీ ఆఫీస్‌ను మూసివేసి స్టార్ హోటల్‌గా మార్చుకోవాలని సూచించారు. రాజకీయం మానేసి బిజినెస్ చేసుకుంటే హరీశ్, కేటీఆర్‌కి మంచిదని సత్యం హితవు పలికారు. కేటీఆర్, హరీశ్‌రావు నీతిమంతుల్లా మాట్లాడుతుండటాన్ని ప్రజలు ఛీకొడుతున్నారన్నారు. కల్వకుంట్ల కుటుంబ నేతలను మించిన పవర్ బ్రోకర్లు ఇంకెవరూ లేరని, పదేళ్ల ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీదని ధ్వజమెత్తారు.

హైవేపై పెరిగిన టోల్‌ఫీజు

నేటి అర్ధరాత్రి నుంచి అమల్లోకి రానున్న ధరలు

కేతేపల్లి: హైదరాబాద్–విజయవాడ 65 నంబరు జాతీయ రహదారిపై టోల్‌గేట్ల వద్ద వాహనదారుల నుంచి వసూలు చేస్తున్న టోల్ ఫీజును రహదారి విస్తరణ కాంట్రాక్టు సంస్థ జీఎమ్మార్ యాజమాన్యం పెంచింది. ఒక్కో వాహనానికి ఒక వైపు, ఇరువైపులా కలిపి రూ. 5నుంచి రూ. 40 వరకు, స్థానికుల నెలవారీ పాస్‌ను రూ.330 నుంచి రూ.340 కి పెంచింది. యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండల ఆంథోల్ మైసమ్మ దేవాలయం నుంచి ఏపీలోని కృష్ణా జిల్లా చిల్లకల్లు వరకు గల 181.5 కి.మీ మేర రెండులేన్లుగా ఉన్న రహదారిని దాదాపు రూ.2000 కోట్ల వ్యయంతో 2012లో బీవోటీ పద్ధతిన జీఎమ్మార్ సంస్థ నాలుగు లేన్లుగా విస్తరించింది. ఈ విస్తరణ పనులకు అయిన వ్యయాన్ని రాబట్టుకునేందుకు 65 నంబరు జాతీయ రహదారిపై ఉమ్మడి నల్లగొండ జిల్లాలో చౌటుప్పల్ మండలం పంతంగి, కేతేపల్లి మండలం కొర్లపహాడ్, ఏపీలోని కృష్ణా జిల్లా చిల్లకల్లు వద్ద ఒకొక్కటి చొప్పున మూడు టోల్‌ప్లాజాలను జీఎమ్మార్ సంస్థ ఏర్పాటు చేసింది. వీటి ద్వారా 2012 నుంచి టోల్‌ఫీజు వసూళ్లను కాంట్రాక్టు సంస్థ ప్రారంభించింది. ఎన్‌హెచ్ఏఐ సూచించిన నిబంధనల మేరకు వార్షిక సవరణల పేరిట ఏడాదికి ఒకమారు వాహనాల నుంచి వసూలు చేస్తున్న టోల్‌ఫీజు ధరలను పెంచుకునే వెసులుబాటు జీఎమ్మార్ సంస్థకు ఎన్‌హెచ్ఏఐ కల్పించింది. ఆయా టోల్‌ప్లాజాల వద్ద ఈనెల 31(ఆదివారం) అర్ధరాత్రి 12 గంటల తర్వాత అంటే ఏప్రిల్ 1 నుంచి పెంచిన టోల్ ధరలు అమల్లోకి రానున్నాయి. ఏడాది కాలం పాటు ఇవే ధరలు అమల్లో ఉంటాయి.

పెరిగిన టోల్‌ఫీజులు ఇలా..

వాహనం	పంతంగి టోల్‌ప్లాజావద్ద		కొర్లపహాడ్ వద్ద	
	ఒకవైపు	ఇరువైపులా	ఒక వైపు	ఇరువైపులా
కారు,జీపు,వ్యాను (లైట్ మోటార్ వెహికల్)	95	145	130	195
లైట్‌కమర్షియల్,గూడ్స్	150	230	205	310
మినీ బస్సు బస్సు, ట్రక్కు (2యాక్సిళ్లు)	315	470	430	640
భారీ వాహనాలు (3 నుండి 6 యాక్సిళ్లు)	485	725	665	995
అతి భారీ వాహనాలు (7 అంతకంటే ఎక్కువ యాక్సిళ్లు)	605	910	825	1240



మూలమూర్తుల ఫొటోలు బయటకు..

- భద్రాచలంలో మాజీ ఎంపీ దర్శనం సందర్భంగా ఫొటోలు తీసిన ఓ వ్యక్తి
- ఆపై సోషల్ మీడియాలో వైరల్

భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అంతరాలయంలో పూజలు చేస్తున్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడం వివాదాస్పదంగా మారింది. మాజీ ఎంపీ, మహబూబాబాద్ లోక్‌సభ స్థానం బీజేపీ అభ్యర్థి సీతారాం నాయక్ శనివారం భద్రాచలంలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆయన వెండి వాకిలి వద్ద నుంచే స్వామిని దర్శించుకుంటుండగా.. వెంట వచ్చిన ఓ వ్యక్తి ఫొటోలు తీశాడు. ఈ ఫొటోలో సీతారాంనాయక్‌తో పాటు అంతరాలయంలో మూలమూర్తులు, అర్చకులు పూజలు చేస్తుండటం కనిపించగా.. బీజేపీ నేతలు మీడియాకు ఈ ఫొటోలనే విడుదల చేశారు. అంతరాలయంతో పాటు ఉపాలయాల్లోని మూలవరుల ఫొటోలు సైతం బయటకు రాగా.. సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అంతరాలయంతో పాటు ఉపాలయాల్లో ఫొటోలు తీయడంపై నిషేధం ఉండగా.. సాధారణ భక్తులెవరినీ సెల్‌ఫోన్లు, కెమెరాలతో ఆలయ ఆవరణలోకి అనుమతించరు. కానీ సీతారాంనాయక్ వెంట ఉన్న వ్యక్తుల విషయంలో అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. ఈ విషయమై ఆలయ ఈఓ రమాదేవిని వివరణ కోరగా, అంతరాలయం, ఉపాలయాల్లో ఎవరు ఫొటోలు తీశారో గుర్తించేందుకు సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎంపీ సీతారాంనాయక్ వెంట ఉన్న వ్యక్తులే ఇందుకు కారణమని ప్రాథమిక విచారణలో తేలిందని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశామని చెప్పారు. సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులకు అందజేస్తామని తెలిపారు.


ఆలయంలో ధ్వజస్తంభం వద్ద మాజీ ఎంపీ సీతారాంనాయక్, అనుచరులు

జీకేవీపీ నిధులు వచ్చేనా?


జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియం

- అంతంతమాత్రంగా గ్రామీణ క్రీడావికాస పథకం అమలు
- కుంటుపడుతున్న క్రీడాభివృద్ధి
- 2006 నుంచి 2015 వరకు రూ.8.69 లక్షలు మాత్రమే విడుదల

మహబూబ్‌నగర్ క్రీడలు: క్రీడాభివృద్ధికి అవసరమైన నిధులను స్థానిక సంస్థల నుంచి సమకూర్చుకునేందుకు 1997లో అప్పటి ప్రభుత్వం జీఓ 1152ను జారీచేసింది. ఈమేరకు కాంట్రిబ్యూషన్ కార్పస్ ఫండ్ కింద గ్రామపంచాయతీలు, మండల పరిషత్, జిల్లా పరిషత్‌ల నుంచి నిధుల సేకరణ కోసం 'గ్రామీణ క్రీడా వికాస పథకం' అమలు చేస్తోంది. ప్రతి ఏడాది జిల్లా పరిషత్ రూ.25 వేలు, మండలపరిషత్‌ల నుంచి రూ.1000 చొప్పున, నోటిఫైడ్ జీపీల నుంచి రూ.500 చొప్పున, నాన్ నోటిఫైడ్ జీపీల నుంచి రూ.250 చొప్పున క్రీడాశాఖకు విడుదల కావాల్సి ఉండగా.. ఉమ్మడి జిల్లాలో కొన్నేళ్లుగా పథకం అమలుతీరు నిరాశజనకంగా ఉంది.

ఉమ్మడి జిల్లాకు రూ.8.69 లక్షలు విడుదల..

జిల్లాల విభజనకు పూర్వం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు గ్రామీణ క్రీడా వికాస పథకం కింద కార్పస్ ఫండ్ రూ.8.69 లక్షలు మాత్రమే విడుదలయ్యాయి. 2006 నుంచి 2015 వరకు జీపీల నుంచి రూ.6.85 లక్షలు, మండల పరిషత్‌ల నుంచి రూ.1.34 లక్షలు, జెడ్పీ నుంచి రూ.50వేలు మాత్రమే జిల్లా క్రీడాశాఖకు విడుదల చేశారు. జిల్లాల విభజన తర్వాత మహబూబ్‌నగర్ జిల్లా క్రీడలు, యువజన శాఖకు రెండు మండల పరిషత్‌ల నుంచి మాత్రమే నిధులు వచ్చాయి. 2019, 2020 సంవత్సరాల్లో భూత్పూర్, మిడ్జిల్ మండలం నుంచి 2020లో రూ.1000 చొప్పున నిధులు విడుదలయ్యాయి.


జిల్లా యువజన, క్రీడాశాఖ కార్యాలయం

ప్రతిపాదనలు పంపినా..

గ్రామీణ క్రీడా వికాస పథకం కింద నిధుల సేకరణకు సంబంధించి నాలుగేళ్ల కిందట తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ నుంచి జిల్లా యువజన, క్రీడాశాఖలకు ఉత్తర్వులు వచ్చాయి. జిల్లా పరిషత్, మండల పరిషత్, గ్రామపంచాయతీలకు ప్రతిపాదనలు పంపాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈమేరకు జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారులు జీకేవీపీ నిధుల కోసం మండల పరిషత్‌లకు ప్రతిపాదనలు పంపగా.. నిధుల విడుదల మాత్రం అంతంతగానే ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా గ్రామీణ క్రీడా వికాస పథకాన్ని పూర్తిస్థాయిలో అమలుచేసి, క్రీడాభివృద్ధికి తోడ్పాటునందించాలని సీనియర్ క్రీడాకారులు కోరుతున్నారు.

జీకేవీపీ నిధులతో మరింత అభివృద్ధి..

క్రీడారంగానికి ప్రభుత్వం నుంచి అరకొరగానే నిధులు వస్తుండటంతో క్రీడలు కుంటుపడుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. నిధుల కొరత కారణంగా క్రీడా పోటీలకు వెళ్లే క్రీడాకారులకు టీఏ, డీఏలు ఇవ్వలేని పరిస్థితి ఉంది. జీకేవీపీ నిధులు విడుదలయితే క్రీడాభివృద్ధికి అవకాశం ఉంటుంది. గ్రామీణ క్రీడా వికాస పథకం అమలుతీరు సరిగ్గా లేకపోవడంతో జిల్లాలో క్రీడాభివృద్ధికి విఘాతం ఏర్పడుతోంది. స్థానిక సంస్థల నుంచి నిధుల సేకరణకు అవకాశం కల్పించినా.. అదీ కూడా పూర్తిస్థాయిలో అమలు కావడంలేదు. స్థానిక సంస్థల నుంచి స్పందన లేకపోవడంతో కొన్నేళ్ల నుంచి ఈ పథకం అమలుతీరు సరిగ్గాలేదనే వాదనలు ఉన్నాయి. గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్‌ల అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంతో ఏటా జిల్లా క్రీడాశాఖలకు నిధులు మంజూరు కావడం లేదనే విమర్శలు ఉన్నాయి.

నిధుల కోసం ప్రతిపాదనలు..



గ్రామీణ క్రీడావికాస పథకం కింద నిధుల కోసం గతంలో జిల్లా పరిషత్, మండల పరిషత్ అధికారులకు ప్రతిపాదనలు పంపడం జరిగింది. మరో సారి అధికారులకు ప్రతిపాదనలు పంపుతాం. ఈ నిధులు వస్తే క్రీడాభివృద్ధికి చేయూత లభిస్తుంది.
– ఎస్.శ్రీనివాస్, డీవైఎస్ఓ, మహబూబ్‌నగర్

జీకేవీపీ నిధుల వివరాలు (ఏడాదికి).. రూ.లలో

జిల్లా పరిషత్	మండల పరిషత్	నోటిఫైడ్ జీపీ	నాన్ నోటిఫైడ్ జీపీ
25,000	1,000	500	250

రాష్ట్ర హ్యాండ్‌బాల్ జట్టు వైస్ కెప్టెన్‌గా శంకర్



జడ్చర్ల: తెలంగాణ రాష్ట్ర సీనియర్ పురుషుల హ్యాండ్‌బాల్ జట్టు వైస్ కెప్టెన్‌గా జడ్చర్ల మండలం కోడ్గల్ జెడ్పీహెచ్ఎస్ వ్యాయామ ఉపాధ్యాయులు శంకర్‌నాయక్ ఎంపికయ్యారు. ఇటీవల తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లాలో జరిగిన 52వ సీనియర్ పురుషులు హ్యాండ్‌బాల్ చాంపియన్ షిప్ రాష్ట్ర టోర్నమెంట్స్ కం సెలక్షన్స్‌లో శంకర్‌నాయక్ కెప్టెన్‌గా వ్యవహరించి జాతీయ స్థాయి జట్టు ఎంపికయ్యేలా తన ప్రతిభను కనబరిచాడు. దీంతో శంకర్‌నాయక్‌ను ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 4 వరకు బీహార్‌లోని బెగుసరాయ్ జిల్లా బరమోనిలో నిర్వహించే జాతీయ స్థాయిపోటీల్లో శంకర్‌నాయక్ తెలంగాణ జట్టు వైస్‌కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా అతడిని పలువురు అభినందించారు.

కనుల పండువగా రథోత్సవం



ఊట్కూరు: మండల పరిధిలోని సమస్తాపూర్ గ్రామశివారులో శంకర్‌లింగేశ్వరి స్వామి రథోత్సవాన్ని శనివారం కనుల పండువగా నిర్వహించారు. 40అడుగుల రథానికి రంగురంగుల పూలతో అలంకరించి స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్టించి భక్తులు రథాన్ని లాగారు. ఈ వేడుకలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి వేలాది భక్తులు హాజరయ్యారు. తెలంగాణ, కర్ణాటక పోలీసులు గట్టి బందోబస్త్‌ను నిర్వహించారు.

గట్టులో పర్వత మల్లన్న భక్తుల సందడి


కాళ్లకు కర్రలను కట్టుకుని పాదయాత్ర చేసుకుంటూ గట్టుకు చేరుకున్న భక్తులు

- కర్రలనే పాదాలుగా చేసుకుని పాదయాత్ర
- ఉగాదికి రెండు రోజుల ముందు శ్రీశైలం చేరుకోనున్న భక్తులు

గట్టు: పాదాలు నేలకు తాకకుండా.. కర్రలే పాదాలుగా చేసుకుని.. వందల కిలోమీటర్ల దూరంలో కొండ, గుట్టలో ఉన్న శ్రీశైల పర్వతమల్లన్న దర్శనం కోసం కర్ణాటకకు చెందిన భక్తులు పాదయాత్ర చేపట్టారు. కర్ణాటకలోని జమఖండి నియోజకవర్గం అలుగురి ప్రాంతానికి చెందిన సాగర్‌లోహరి, అశోక్‌నటికార్ తమ కాళ్లకు కర్రలను కట్టుకుని 300 కిలోమీటర్లు నడుచుకుంటూ శనివారం గట్టుకు చేరుకున్నారు. మరో 200 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేయాల్సి ఉందని పాదయాత్రికులు తెలిపారు. 70 మంది బృందం సభ్యులు పాదయాత్ర చేపట్టినట్లు భక్తులు తెలిపారు. కర్ణాటకలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ప్రతిఏటా శ్రీశైలానికి పాదయాత్ర చేపడుతుంటారు. హోలీ పండుగతో వీరి స్వగ్రామాల్లో పాదయాత్రను ప్రారంభిస్తామని కర్ణాటక భక్తులు తెలియజేశారు. ఉగాదికి రెండు రోజుల ముందే శ్రీశైలం చేరుకునేలా పాదయాత్ర ప్రణాళిక సిద్ధం చేసుకుంటామని చెప్పారు. పాదయాత్రలో యువకులు, మహిళలు, వృద్ధులు, చిన్నారులు, బాలికలు ఇలా ప్రతిఒక్కరూ భక్తితో పాదయాత్ర ద్వారా శ్రీశైలం తరలి వెళ్తున్నారు. పాదయాత్ర చేస్తున్న వారికి మార్గమధ్యంలో కొందరు దాతలు ఆహారం, పానియాలను అందజేస్తున్నారు. దారి మధ్యలో దాతలు సమకూర్చిన ఆహారాన్ని స్వీకరిస్తూ.. శ్రీశైల మల్లన్న నామస్మరణ చేసుకుంటూ కర్ణాటక భక్తులు గట్టు మీదుగా శ్రీశైలం తరలి వెళ్తున్నారు. పాదయాత్రికులతో గట్టు ప్రాంతం కళకళలాడుతోంది.


గట్టు మీదుగా శ్రీశైలం వెళ్తున్న కర్ణాటక భక్తులు

ఆడపడుచుగా ఉగాదికి సారే ప్రదానం...

శ్రీశైలభ్రమరాంబికాదేవిని కర్ణాటక వాసులు తమ ఇంటి ఆడపడుచుగా కొలుస్తారు. ప్రతి ఏటా ఉగాదికి శ్రీశైలభ్రమరాంబికా దేవీకి సారె (పసుపు, కుంకుమ, గాజులు, పండ్లు, చీర)ను అమ్మవారికి సమర్పించుకుని, కొత్త ఏడాది మంచి జరగాలని కోరుకుంటున్నట్లు భక్తులు తెలిపారు. ఇలా ఉగాది రోజున శ్రీశైలం కర్ణాటక భక్తులతో కిటకిటలాడుతుంటుంది.

ఉత్తమ గ్రేడ్ సాధించేందుకు కృషిచేయాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: యూనివర్సిటీకి మంచి న్యాక్ గ్రేడింగ్ సాధించేందుకు ప్రతిఒక్కరు కృషి చేయాలని పీయూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ అన్నారు. శనివారం పీయూలో వివిధ డిపార్ట్‌మెంట్ల హెచ్‌ఓడీలు, ప్రిన్సిపాళ్లు, పీజీ సెంటర్ల కోఆర్డినేటర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సంవత్సరం న్యాక్ గ్రేడింగ్ కోసం దరఖాస్తు చేశామని, త్వరలో న్యాక్ కమిటీ పీయూ సందర్శించే అవకాశం ఉందన్నారు. గత జనవరి నుంచి డిసెంబర్ వరకు పూర్తి వివరాలతో కూడిన ఎస్ఎస్ఆర్ (సెల్ఫ్ స్టడీ రిపోర్టు)ను ఇవ్వాలని కోరారు. ఇప్పటికే పీయూకు బీ గ్రేడింగ్ ఉందని, ఇటీవలి పీయూ పరిధిలోని పలు కళాశాలలకు ఏ గ్రేడ్ వచ్చిందని చెప్పారు. న్యాక్ గ్రేడింగ్‌తో రూసా ఫండింగ్ పెరుగుతుందని, దాని ద్వారా యూనివర్సిటీతోపాటు పీజీ సెంటర్లలో వసతులు మెరుగుపడి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. పీయూ పరిధిలో అభివృద్ధి పనులు, వసతుల కల్పన వంటివి పూర్తయ్యాయని, న్యాక్ కమిటీ తేదీలను ప్రకటిస్తే యూనివర్సిటీని సందర్శిస్తారన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ రాజ్‌కుమార్, ప్రిన్సిపాళ్లు బషీర్ అహ్మద్, చంద్రకిరణ్, హెచ్‌ఓడీలు, గద్వాల, కొల్లాపూర్, వనపర్తి పీజీ సెంటర్ల కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్

'నిరుద్యోగంపై చర్చకు సిద్ధమా..?'

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రధాని నరేంద్రమోదీ పాలన చూసి ఓట్లు వేయండని కోరుతున్న ఇక్కడి బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ దేశంలోని నిరుద్యోగతపై చర్చకు సిద్ధమా అని టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి సవాల్ విసిరారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్, ఐహెచ్‌డీ నివేదిక ప్రకారం దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో 83 శాతం, పట్టణాల్లో 17 శాతం నిరుద్యోగత పెరిగిందన్నారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న బీజేపీ ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసిందన్నారు. బీఎస్ఎన్ఎల్‌ను పూర్తిగా తుడిచివేశారని, కేవలం తెలంగాణ రాష్ట్రంలో 60 వేల మంది ఉద్యోగులు రోడ్డున పడ్డారని ఆరోపించారు. ఎల్ఐసీ కూడా క్రమంగా క్షీణించిపోవడానికి మోదీనే కారణం అన్నారు. ఆర్డీఎస్ తుమ్మిళ్లకు నీళ్లు రాకుండా చేసే కర్ణాటకలోని అప్పర్‌బద్ర ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పిస్తే బీజేపీ అభ్యర్థి ఎందుకు మాట్లాడలేదన్నారు. నారాయణపేట జిల్లాకు సైనిక్ స్కూల్ మంజూరై వెనక్కిపోతే ఇప్పటి బీజేపీ అభ్యర్థి అప్పట్లో ఎమ్మెల్యేగా ఉండి కూడా స్పందించలేదన్నారు. సమావేశంలో జిల్లా మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మణ్‌యాదవ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హర్షవర్ధన్‌రెడ్డి